క్లుప్తంగా

డీఎస్సీ పరీక్ష కేంద్రం వద్ద పటిష్ట భద్రత



పరీక్ష కేంద్రం వద్ద పోలీసులకు సూచనలిస్తున్న డీఎస్పీ విజయికుమార్

పుట్టపర్తి టౌన్: డీఎస్సీ పరీక్ష కేంద్రం వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు డీఎస్పీ విజయకుమార్ తెలిపారు. శుక్రవారం డీఎస్సీ పరీక్ష కేంద్రమైన సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాల వద్ద బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి సూచనలు సలహాలు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి సంఘటనలు జరగకుండా 144 సెక్షన్‌తో పాటు 30 యాక్ట్ అమలు చేశామన్నారు. ఇదిలా ఉండగా ఉదయం జరిగిన పరీక్షకు 102 మందికిగాను 93 మంది, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 100 మందికిగాను 90 మంది హాజరయ్యారు.

ఫిజియోథెరపీతో ఆరోగ్య సమస్యలు దూరం



మాట్లాడుతున్న ఫిజియోథెరపిస్టు రమేష్

బత్తలపల్లి: ఫిజియోథెరపీతో ఆరోగ్య సమస్యలు దూరమవుతాయని ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ రమేష్ పేర్కొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం డాక్టర్ రమేష్, సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో ఫిజియోథెరపీ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిజియోథెరపీ, ఆహారపు అలవాట్లతో కలిగే ప్రయోజనాలను వారు తెలియజేశారు. ఎంపీడీఓ నరసింహనాయుడు, పరిపాలన అధికారి శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపీడీఓ క్రిష్టప్ప, ఉపాధిహామీ పథకం సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్‌క్యాంపులు

కదిరి అర్బన్: మండలంలో చిన్నారులకు కొత్తగా ఆధార్‌కార్డు నమోదు కోసం ఆధార్ స్పెషల్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ పోలప్ప శుక్రవారం తెలిపారు. 0-6 ఏళ్లు దాటిన చిన్నారులకు బయోమెట్రిక్ అప్‌డేట్, అలాగే ఆధార్‌కార్డు పొంది 5-15 ఏళ్ల పిల్లలకు బయోమెట్రిక్ అప్‌డేట్ సేవలు అందిస్తారన్నారు. ఈ నెల 10న కదిరి బ్రాహ్మణపల్లి, కదిరి కుంట్లపల్లి, 11న కదిరి బ్రాహ్మణపల్లి, పట్నం, 12న కుమ్మరవాండ్లపల్లి-1,కాళసముద్రం, 13న కుమ్మరవాండ్లపల్లి-1,యర్రదొడ్డి, 24న కదిరి బ్రాహ్మణపల్లి,కదిరి కుంట్లపల్లి 25న కదిరి బ్రాహ్మణపల్లి, పట్నం గ్రామాల్లో క్యాంపులు ఉంటాయన్నారు.

అయ్యప్ప స్వామి ఆలయానికి విరాళం



దాత నాగరాజును సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కనగానపల్లి: మండల కేంద్రంలో నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయ అభివృద్ధికి దాత దాసరి చిన్న ఓబిలేసు కుమారుడు దాసరి నాగరాజు శుక్రవారం రూ.1.7 లక్షలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ను ప్రత్యేకంగా సన్మానించారు. ఆలయ అభివృద్ధి కోసం ఆర్థికసాయం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇటువంటి దాతలు, భక్తుల సహకారంతో అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేశామని కమిటీ సభ్యులు తెలిపారు.

ఎగ్జిట్ డోర్ ఏర్పాటు చేయండి

కదిరి అర్బన్: యర్రదొడ్డిగంగమ్మ ఆలయంలో ఎగ్జిట్ డోర్ ఏర్పాటు చేయాలని ఎండోమెంట్ డీఈ ప్రసాద్‌ను ఎంపీడీఓ పోలప్ప కోరారు. శుక్రవారం ఆలయాన్ని పరిశీలించారు. పండుగల సమయాల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని ప్రవేశమార్గము ఒకటే ఉండడంతో లోపల వెంటిలేషన్ తక్కువగా ఉండి భక్తులు ఇబ్బందులకు గురవుతారని ఎంపీడీఓ డీఈకి తెలియజేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

క్షయపై అప్రమత్తంగా ఉండాలి

కదిరి అర్బన్: క్షయపై బాధితులు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. కాళసముద్రం గ్రామంలో శుక్రవారం క్షయవ్యాధిపై కదిరి, పట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, సాయంత్రంపూట జ్వరం ఉన్నవారు దగ్గరోని ఆసుపత్రిలో గళ్లపరీక్ష చేయించుకోవాలన్నారు. పరీక్షల్లో పాజిటివ్‌గా నిర్ధారణ అయిన రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. బాధితుల పౌష్టికాహారానికి ప్రతి నెలా రూ.1000 వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, పీహెచ్‌ఎన్ లక్ష్మీదేవమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.



వి. రమణప్పగారిపల్లి ఎస్సీ కాలనీకి వెళ్లే రోడ్డు దుస్థితి



ఉజావర్లకు వెళ్లే రోడ్డుకిరువైపులా పెరిగిన కంపచెట్లు

పల్లె దారులు ఛిద్రం

- గుంతల రోడ్లపై ప్రయాణం నరకం

నల్లచెరువు: మండలంలో పలు గ్రామీణ ప్రాంత రహదారులు అధ్వానంగా మారాయి. కమ్మవారిపల్లి, కె.పూలకుట రోడ్డు, పెద్దయల్లంపల్లి - రమణప్పగారిపల్లి రోడ్డులో కంకర తేలి గోతులు ఏర్పడ్డాయి. ఆ మార్గంలో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి కిందపడటంతో గాయాలపాలయ్యారు. పల్లె రోడ్ల రూపురేఖలు మారుస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినా నిలబెట్టుకోలేకపోయిందని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుంతలతో పాటు రోడ్డు కిరువైపులా కంప చెట్లు ఏపుగా పెరిగిపోవడంతో ఎదురుగా వాహనం వస్తే భయం భయంగా ప్రయాణించాల్సి వస్తోంది. పాలకులు, అధికారులు స్పందించి రోడ్లు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



నల్లచెరువు నుంచి కె.పూలకుంటకు వెళ్లే రోడ్డు ఇలా..

నూతన పద్ధతులతో అధిక దిగుబడులు

బత్తలపల్లి: పంటల సాగులో రైతులు నూతన వ్యవసాయ పద్ధతులను పాటించి అధిక దిగుబడులు సాధించాలని శాస్త్రవేత్తలు సూచించారు. 'వికసిత్ కృషి సంకల్ప అభియాన్' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బత్తలపల్లి, సంజీవపురంలో శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు పర్యటించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగంలో అధిక మోతాదులో ఉపయోగించే ఎరువులు, పురుగుల మందులకు స్వస్తి చెప్పి పంటల సాగులో రైతులు వైవిధ్యతను ప్రోత్సహించాలని కృషి విజ్ఞాన కేంద్రం రెడ్డిపల్లి, రేకులకుంట లైవ్ స్టాక్ రీసర్చ్ స్టేషన్ శాస్త్రవేత్తలు డాక్టర్ శశికళ, డాక్టర్ జాహ్నవి, డాక్టర్ శ్రీనివాస్‌నాయక్, రఘుకరణ్ రైతులకు తెలియజేశారు. పంటల సాగులో అనువైన విత్తనాలు, రకాలు, వాతావరణ పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సలహాలు, పాటించడం, తక్కువ మందుల పిచికారీ తదితర అంశాలు అధిక దిగుబడులపై ఆధారపడి ఉంటాయన్నారు. పంట సాగుకు ముందు పచ్చిరొట్ట ఎరువులు వేయడం ద్వారా భూసారం పెరుగుతుందని తెలియజేశారు. అనంతరం భూసార పరీక్ష పత్రాలను పంపిణీ చేశారు. ఏఓ ఓబిరెడ్డి, ఏఈఓలు శ్రీనివాస్, ఉపేంద్రరెడ్డి, రైతు సేవ కేంద్రాలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి ఓబిరెడ్డి

పంటల సాగులో వైవిధ్యతను ప్రోత్సహించాలి

అమడగూరు: పంటల సాగులో వైవ్యిదతను ప్రోత్సహించాలని కృషి విజ్ఞాన కేంద్రం రెడ్డిపల్లి అలాగే ఐఐఓఆర్ శాస్త్రవేత్తలు డాక్టర్ మాధవి, డాక్టర్ దూరయ్ మురుగన్ పేర్కొన్నారు. శుక్రవారం మహమ్మదాబాద్‌లో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శాస్త్రవేత్తలు మాట్లాడుతూ వ్యవసాయంలో నూతన పద్ధతులు, వంగడాలు, డ్రోన్ స్ప్రేయింగ్, ఇతర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. అనువైన విత్తనాలు, వాతావరణ పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. అనంతరం భూసార పత్రాలను పంపిణీ చేశారు. ఏఓ వెంకటరమణాచారి, ఆర్‌ఎస్‌కే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కమిటీల నియామకం

ధర్మవరం: ధర్మవరం మున్సిపాలిటీకి సంబంధించి వైఎస్సార్‌సీపీ నూతన కమిటీ నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు అందాయి. ధర్మవరం మున్సిపాలిటీ క్లస్టర్-1 పార్టీ అధ్యక్షుడిగా నీలూరి ప్రకాష్, క్లస్టర్-2 పార్టీ అధ్యక్షుడిగా కోటిరెడ్డి బాలిరెడ్డి, ఉపాధ్యక్షులుగా మద్దిలేటి మల్లికార్జున, కత్తె పెద్దన్న, ప్రధాన కార్యదర్శులుగా ఆకుల రామలింగ, బండి వెంకటశివ, బాలం గోపాల్, చిన్నపరెడ్డి శివారెడ్డి, కార్యదర్శులుగా తిరుమలరెడ్డి, తిరుపాల్‌రెడ్డి, గోపాల్, ఆవుల పోతిరెడ్డి, ఈశ్వర్‌రంగ, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా మల్లికార్జున, కమలాకర్, శ్రీనివాసులు, దస్తగిరి, వై.భాస్కర్‌రెడ్డి, కె.రామ్మోహన్‌రెడ్డి, నాగరాజు, వెంకటరాముడు, సూర్యనారాయణ రెడ్డి, హనుమంతురెడ్డి, సాకే వెంకటేష్, రామంజినేయులు, చలపతి, రాజారెడ్డి, ఎర్రిస్వామి, అంజనరెడ్డి, మంజునాథ్, అంకె లక్ష్మీనారాయణ, చింతా నరేష్‌రెడ్డి, షెక్షావలి, జింకా చంద్రశేఖర్, టి.చంద్రశేఖర్, ఎ.క్రిష్ణారెడ్డిని నియమించారు.

ముదిగుబ్బ: వైఎస్సార్‌సీపీ ముదిగుబ్బ మండల ఉపాధ్యక్షులుగా ఎం. శ్రావణ్‌కుమార్, వి. చంద్ర, ప్రధాన కార్యదర్శులుగా ఎస్. ఆదినారాయణరెడ్డి, వి.కేశవ, ఎ. మహేష్, ఎస్. నరహరి, కార్యదర్శులుగా సి.గోపికృష్ణ, డి. సునీత, ముష్కిన్‌వలి, జె. రామచంద్ర, జి. సురేంద్ర, సభ్యులుగా వెంకటరెడ్డి, బాలునాయక్, శివానాయక్, ఎం. నాగేంద్రనాయక్, వి. చంద్రశేఖర్ నాయక్, నారాయణస్వామి, చిన్న నారాయణరెడ్డి, పి.నారాయణరెడ్డి, నారాయణస్వామి, వి.భాస్కర్‌రెడ్డి, జి.రమేష్, పి. ఓబిలేసు, వేమాచారి, ఎం. మల్లికార్జున, జి. రాజబాబు, ప్రసాద్, బి. సూర్యనారాయణ, కె. వెంకటరాముడు, సి.కాటమయ్య, బి, మల్లి నియమితులయ్యారు.

బత్తలపల్లి: వైఎస్సార్‌సీపీ బత్తలపల్లి మండల ఉపాధ్యక్షులుగా జి.ప్రతాప్‌రెడ్డి, పెద్దయ్య, ప్రధానకార్యదర్శులుగా కె.ప్రసాద్, సి.గోపాల్, షేషావలి, యు.భానుప్రకాష్‌రెడ్డి, కార్యదర్శులుగా హనీష్, జి.ఆదినారాయణ, బి.రమణారెడ్డి, కె.ప్రసాద్, గంగన్న, సభ్యులుగా కె.నరసింహారెడ్డి, బి.ప్రతాప్‌రెడ్డి, రమణ, ఎన్.మహబూబ్‌బాషా, కె.చైతన్యరెడ్డి, లింగమయ్య, పాళ్యం అప్పస్వామి, ఈశ్వరయ్య, రమాదేవి, కె.శివయ్య, బి.నారాయణస్వామి, సి.సుధాకరరెడ్డి, ఉస్మాన్, ఈడిగ శేఖర్, ఎన్.నారాయణస్వామి, వి.కోనారెడ్డి, దేవా, సి.శేఖర్‌నాయుడు, సాంబ, టి.సురేష్, జి.అనిల్‌కుమార్‌ను పార్టీ అధిష్టానం నియమించింది.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో శుక్రవారం లలిత నాట్య కళానికేతన్ నాట్యాచార్యులు బాబుబాలాజీ, కమలాబాలాజీ, రామలాలిత్య ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. వేసవి శిక్షణా శిబిరం ముగింపు సందర్భంగా చిన్నారులు కూచిపూడి, భరతనాట్యం, జానపద నాట్యాలు, నృత్య రూపకం ప్రదర్శించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ముందు తరాలకు అందించాలన్న సదుద్దేశంతో శిక్షణ ఇస్తున్నట్లు మాస్టర్ బాబుబాలాజీ తెలిపారు. నృత్య ప్రదర్శనను తిలకించేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, బీజేపీ ఇన్‌చార్జ్ హరీష్‌బాబులు హాజరై విద్యార్థినులకు సర్టిఫికెట్లు, మెమెంటోలు అందించారు.



నాట్యం చేస్తున్న విద్యార్థినులు

ఘనంగా తోపుదుర్తి జన్మదిన వేడుకలు



చెన్నేకొత్తపల్లిలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో శుక్రవారం రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని పలు గ్రామాల నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు చెన్నేకొత్తపల్లికి తరలివచ్చారు. న్యామద్దెల సర్కిల్‌లో ఉన్న డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. తోపుదుర్తి ప్రకాష్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రామ దేవత కొల్లాపురి దేవి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ డోలా రామచంద్రారెడ్డి, జెడ్పీటీసీ గోవింద రెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రామకృష్ణారెడ్డి, ఎం.ప్రకాష్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ఒకరికి తీవ్రగాయాలు

కనగానపల్లి: పర్వతదేవరపల్లి సమీపంలో శుక్రవారం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు రాప్తాడు మండలం మరూరు గ్రామానికి చెందిన కదిరప్ప ద్విచక్ర వాహనంలో మరూరు నుంచి మామిళ్లపల్లి వైపు వెళ్తున్నాడు. ఈ సందర్భంలో వెనుక వైపు వస్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో అతను ఎగిరి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. హైవే పెట్రోలింగ్ సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని గాయపడిన వ్యక్తిని అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

దోమలను నిర్మూలించండి

పుట్టపర్తి అర్బన్: దోమలను నిర్మూలించడం ద్వారా రోగాలను దరి చేరకుండా చూసుకోవచ్చని వైద్యాధికారులు పేర్కొన్నారు. శుక్రవారం జగరాజుపల్లిలో మలేరియా నివారణ మాసోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజలకు మలేరియా, దోమల నిర్మూలనపై పలు సూచనలు చేశారు. పరిసరాల పరిశుభ్రత ద్వారానే దోమలను నివారించవచ్చన్నారు. వైద్యాధికారి జ్యోత్స్న, సీహెచ్ఓ నగేష్, ఎంపీహెచ్ఈఓ గఫూర్, ఎస్ఓయూ రమణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ ఉపకార వేతనానికి విద్యార్థిని ఎంపిక

ధర్మవరం రూరల్: ధర్మపురి ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన యు.మధులిక అనే విద్యార్థిని జాతీయ ఉపకార వేతనానికి ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం జి.సౌభాగ్యమ్మ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉపకార వేతనానికి ఎంపికైన విద్యార్థినిని పాఠశాల ఉపాధ్యాయులు కుళ్లాయప్ప, నాగరాజు, గ్రామస్తులు అభినందించారు.

అమడగూరు: ఆదర్శ పాఠశాలలో 8 వ తరగతి చదువుతున్న బిందు శ్రీ అనే విద్యార్థి జాతీయ ఉపకార వేతనానికి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. బిందు శ్రీ కి ఏడాదికి రూ.12 వేల చొప్పున నాలుగేళ్ల పాటు ఉపకార వేతనం అందుతుందన్నారు.

ప్రతిభా అవార్డులకు ఎంపిక

కదిరి అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన నలుగురు విద్యార్థినులు రాష్ట్ర ప్రభుత్వం అందించే ప్రతిభా అవార్డులకు ఎంపికైనట్లు కళాశాల పిన్సిపాల్ వెంకటేశ్వరప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఇందులో ఎం నాగశ్వేత(960), ఎస్ రెడ్డి లక్ష్మీ(952), ఎం కళ్యాణి మహా(928),వీ నీరజా(904) ఉన్నారని, వీరు ఈనెల 9న కొత్తచెరువులో జిల్లా కలెక్టర్‌తో మెమెంటోతో పాటు నగదు అవార్డులు అందుకుంటారన్నారు. తమ కళాశాల విద్యార్థులు ప్రతిభా అవార్డులకు ఎంపిక కావడం సంతోషంగా ఉందని ప్రిన్సిపాల్, అధ్యాపకులు పేర్కొన్నారు.

షిర్డీసాయి విగ్రహ ప్రతిష్ట

కదిరి టౌన్: ముత్యాలచెరువు రోడ్డు సమీపంలో షిర్డీసాయిబాబా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నిర్వాహకుడు సాయి శీనా ఆధ్వర్యంలో వేద పండితులు శాస్త్రోక్తంగా కార్యక్రమాన్ని చేపట్టారు. ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ లింగాల శివశంకర్‌రెడ్డి స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. బెంగళూరుకు చెందిన ఉమా శ్రీనివాసరావు, నందకార్తీక్, హర్ష, వందన తదితరులు రూ.10 లక్షలు విలువైన షిర్డీసాయి విగ్రహాన్ని వితరణ చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. లాయర్ వాసుదేవరెడ్డి, సొసైటీ మాజీ మేనేజర్ నరసింహారెడ్డి, రామిరెడ్డి, దేవ, సుబ్బరాజు పాల్గొన్నారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోండి

ధర్మవరం అర్బన్: బక్రీద్ పండుగను పట్టణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని ఆర్డీఓ మహేష్ పేర్కొన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం బక్రీద్ పండుగను పురస్కరించుకుని సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ మసీదులు, ఈద్గాల వద్ద పండుగ సమయంలో సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. బక్రీద్ పండుగకు ముస్లింలు పెద్ద ఎత్తున ప్రార్థనలకు హాజరుకానున్నారని మసీదుల వద్ద సెక్యూరిటీ, మెడికల్, నీటి వసతి, లా అండ్ ఆర్డర్ సమస్యలు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ముస్లింలు, హిందువులు ఐకమత్యంతో జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్ఐ కేతన్న, మున్సిపల్ టీపీఓ పెనుబోలు విజయభాస్కర్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ మహేష్

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న ఆర్డీఓ సువర్ణ

పుట్టపర్తి అర్బన్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ పేర్కొన్నారు. యోగాంధ్రాలో భాగంగా ఆర్డీఓ సువర్ణ, ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి, ఐసీడీఎస్ ఉద్యోగుల ఆధ్వర్యంలో పుట్టపర్తిలోని షాదీమహల్‌లో యోగాపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్డీఓ సువర్ణ మాట్లాడుతూ ఉద్యోగులు యోగా చేయడం ద్వారా మానసిక ఒత్తిడిని తొలగించుకోవచ్చన్నారు. శిక్షకుడు నారాయణరెడ్డి మాట్లాడుతూ ఈ యోగాకు ఎన్నో రోగాలను మటు మాయం చేసే శక్తి ఉందన్నారు. శిక్షణ అనంతరం ఉద్యోగులతో పలు ఆసనాలు చేయించారు.

కదిరి అర్బన్: యోగాతో మానసిక ప్రశాంతత కలగడంతో పాటు శారీరక రుగ్మతలు తొలగిపోతాయని ఆర్డీఓ వీవీఎస్ శర్మ పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం జరిగిన యోగాంధ్ర కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాను ప్రతి ఒక్కరూ దినచర్యగా పాటించాలన్నారు. ఎంపీడీఓ పోలప్పతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

కదిరి టౌన్: ఎరుకలవాండ్లపల్లి టోల్‌గేట్ వద్ద శుక్రవారం రాత్రి బైక్, ఆటో ఢీ కొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. పట్నం మాజీ సర్పంచ్ మహేష్ శుక్రవారం రాత్రి కదిరిలో పని ముగించుకుని బైక్‌పై ఐదేళ్ల కుమారుడితో కలిసి స్వగ్రామానికి బయలుదేరాడు. ఎరుకలవాండ్లపల్లి టోల్‌గేట్ వద్ద పోలీసులను చూసిన ఆటోడ్రైవర్ అకస్మాత్తుగా ఆటోను కుడిచేతి వైపు తిప్పాడు. వెనుక వస్తున్న బైక్ ఆటోను ఢీకొన్ని బైక్‌పై మహేష్, అతడి కుమారుడు కిందపడి తీవ్రగాయాల పాలయ్యారు. స్థానికులు వారిని కదిరి ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం తీసుకెళ్లారు.

ట్రాక్టర్ కింద పడి వ్యక్తికి తీవ్ర గాయాలు

ధర్మవరం రూరల్: తుమ్మల గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి అనే వ్యక్తి గురువారం రాత్రి ట్రాక్టర్ కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు తన వ్యవసాయ పొలంలో నీటి తొట్టి నిర్మాణానికి గుంతను తవ్వారు. ట్రాక్టర్‌ను వెనుకకు తీసుకెళ్లుతుండగా ఒక్కసారిగా గట్టు ఒరిగి ట్రాక్టర్ గుంతలో పడిపోయింది. ఈ ప్రమాదంలో చంద్రశేఖర్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతడిని ధర్మవరం తరలించారు. ప్రథమ చికిత్స తర్వాత బెంగళూరుకు తీసుకెళ్లారు.

కేసు నమోదు

ధర్మవరం అర్బన్: దివ్యాంగుడిపై దాడి చేసిన ఆటోడ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రెడ్డెప్ప శుక్రవారం తెలిపారు. కదిరిగేటు సమీపంలో గురువారం రాత్రి పుట్టు మూగ, చెవిటి అయిన రాజశేఖర్‌ను డబ్బు ఇవ్వలేదని ఆటో డ్రైవర్ ఆటో శివ అలియాస్ ఆటో శీన దాడి చేశాడన్నారు. బాధితుడి తండ్రి ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

అమ్మాయి అదృశ్యం

కదిరి అర్బన్: కుమ్మరవాండ్లపల్లిలో ఓ అమ్మాయి అదృశ్యమైంది. తన మేనత్త ఇంట్లో ఉన్న ఆమె బెంగళూరులో ఉన్న తల్లిదండ్రుల వద్దకు వెళ్తానని చెప్పి ఈ నెల 4న ఇంటి నుంచి వెళ్లి పోయింది. తర్వాత ఆమె ఆచూకీ లభించలేదు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసుకుని గాలింపు చేపట్టినట్లు రూరల్ అప్‌గ్రేడ్ పోలీసులు తెలిపారు.

గ్రామాల్లో పోలీస్ నిఘా తప్పనిసరి

తలుపుల : మండలంలోని ప్రతి గ్రామంలో పోలీస్ నిఘా తప్పనిసరిగా ఉంచాలని డీఎస్పీ శివనారాయణ స్వామి సిబ్బందిని ఆదేశించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన ఎస్ఐ నరసింహుడుతో పెండింగ్ కేసులు, ఫ్యాక్షన్ గ్రామాలపై నిఘా, గ్యాంబ్లింగ్, నాటుసారా తదితర అంశాలపై ఆరా తీశారు.

పారిశుధ్య పనులు

నల్లచెరువు: నల్లచెరువు మేజర్ పంచాయతీలోని గ్రామాల్లో పారిశుధ్య పనులను పక్కాగా చేపట్టాలని ఎంపీడీఓ రఘునాథ గుప్త, సర్పంచ్ పంచరత్నమ్మ సిబ్బందిని ఆదేశించారు. పత్రవాండ్లపల్లిలో శుక్రవారం ఎంపీడీఓ ఆధ్వర్యంలో కార్మికులు పారిశుధ్య పనులు చేపట్టారు.

త్యాగానికి, దానధర్మాలకు ప్రతీక బక్రీద్



దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

పుట్టపర్తి టౌన్ : త్యాగం, దానధర్మాలకు ప్రతీక బక్రీద్ అని మాజీ ఎమ్మెల్యే దద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం బక్రీద్ పండగను పురస్కరించుకొని ఆయన ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు. బక్రీద్ పండుగను నియోజకవర్గం వ్యాప్తంగా ముస్లింలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, అల్లా అందరికీ మంచి చేయాలని ఆకాంక్షించారు.

ఆత్మకూరు: త్యాగం, సహనం, ఐకమత్యానికి ప్రతీక బక్రీద్ అని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ముస్లింలకు శుక్రవారం ఓ ప్రకటనలో బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. దేవుడి దయతో ప్రజలందరూ ఆరోగ్యాలు, సుఖ సంతోషాలు జీవించాలని ఆకాంక్షించారు. ప్రజలందరికీ అల్లాహ్ ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



అన్వర్‌బాషా(ఫైల్)

అమడగూరు: మండలంలోని మహమ్మదాబాద్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ సెల్ మండలాధ్యక్షుడు అన్వర్‌బాషా (48) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. అనారోగ్యంతో తిరుపతిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన పరిస్థితి విషమించడంతో అక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తనకంటి జయప్పతో పాటుగా పలువురు నేతలు గ్రామానికి చేరుకుని మృతుడి కుటుంబానికి సంతాపాన్ని తెలియజేశారు. అధైర్యపడొద్దని అండగా ఉంటామని భరోసా కల్పించారు.

సామూహిక అక్షరాభ్యాసం



చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

ఓడీచెరువు: ఎం.కొత్తపల్లి బండపై వెలసిన ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఏటా జ్యేష్ఠమాసంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్మాణ సంకల్పకులు పచ్చర్ల ఆంజనేయులు స్వామి తెలిపారు. జోగి శ్రీదేవి ఫౌండేషన్ శ్రీకాంత్, తహసీల్దార్ అనంతాచారి, రిటైర్డ్ ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్, ఉపాధ్యాయులు గౌస్ లాజమ్ కార్యక్రమానికి తోడ్పాటునందించారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమానికి విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ మారగానికుంట్ల ఫక్రుద్దీన్, చాంద్‌బాషా, సుహసిని సహకరించారు. కార్యక్రమంలో రాము, టైలర్ నిజాం, శీను, శేషు తదితరులు పాల్గొన్నారు.

12వ రోజూ రైతుల నిరసన

ముదిగుబ్బ: జాతీయ రహదారికి 342కు సంబంధించి భూ పరిహారం పెంచాలని కోరుతూ మండల కేంద్రం సమీపంలో రైతులు శుక్రవారం 12వ రోజు నిరసన కార్యక్రమం చేపట్టారు. తమకు న్యాయమైన పరిహారం ఇచ్చేదాకా పనులు జరగనివ్వమని వారు తేల్చిచెప్పారు. కార్యక్రమంలో రైతులు సోమల ప్రకాష్ నాయుడు, రాజేంద్రనాయుడు, హనుమంతు, ప్రసాద్, శంకర్, రమణ, సనత్‌కుమార్, ప్రభాకర్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో బెల్టు గ్రేడింగ్ టెస్ట్



బెల్టులు, సర్టిఫికెట్లు అందిస్తున్న హెచ్ఎం మేరివరకుమారి, కరాటే మాస్టర్ ఇనాయత్‌బాషా

ధర్మవరం: పట్టణంలోని కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం కరాటే బెల్టు గ్రేడింగ్ టెస్ట్‌ను నిర్వహించామని మల్టీస్టార్ బుడోకాన్ కరాటే అకాడమి కరాటే మాస్టర్ ఇనాయత్‌బాషా తెలిపారు. ఇందులో విద్యార్థులు ప్రతిభ చూపి ఎల్లో, ఆరెంజ్, గ్రీన్, బ్లూ, బ్రౌన్ బెల్టులు సాధించారన్నారు. విద్యార్థులందరికి పాఠశాల హెచ్ఎం మేరివరకుమారి, సీనియర్ కరాటే బ్లాక్ బెల్టర్స్ నవ్యశ్రీ, శ్రీనాథ్‌నాయుడు, గంగాధర్, హర్షిని, ఇర్షాద్, మహిధర్ చేతులమీదుగా బెల్టులు, సర్టిఫికెట్లు అందించారు.